క్లుప్తంగా

ఉద్యోగ విరమణ సహజం



సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నేరడిగొండ: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమేనని కుంటాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు అంబారావు అన్నారు. చించోలి గ్రామంలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న రూపావత్ కిషన్ మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. కుంటాల కాంప్లెక్స్ పాఠశాలలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయనను శాలువాతో సత్కరించి పుష్ప గుచ్ఛాలు అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ: తెలంగాణ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఇచ్చోడ గురుకుల కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాల్గొవ తరగతి చదువుతున్న విద్యార్థులు ప్రవేశపరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఒక ఫొటో ఆధార్ కార్డు, 4వ తరగతి బోనఫైడ్‌తో పాటుగా విద్యార్థి సంతకంతో మీసేవలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జనవరి 1 చివరి తేదీ కాగా, పరీక్ష ఫిబ్రవరి 20వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు.

'పత్తి ధర తగ్గించడం అన్యాయం'



మాట్లాడుతున్న సంగెపు బొర్రన్న

బోథ్: బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో పత్తి ధరను రూ.100 తగ్గించడం అన్యాయమని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. పత్తి పింజ పొడవు తగ్గిందనే కారణంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పత్తి ధరను తగ్గించడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదిలాబాద్, భైంసా మార్కెట్‌లో పత్తి ధర రూ. 50 తగ్గిస్తే, బోథ్ మార్కెట్‌లో ధరను రూ.100 తగ్గించడం దారుణమన్నారు. పత్తి ధర తగ్గినప్పుడు ప్రభుత్వం వారికి తగ్గిన ధరను కట్టివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు రవి, సుభాష్, బాలాజీ, సుధాకర్, గోపి, ధన్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



భోజనం పరిశీలిస్తున్న డీడీ వసంత్‌రావు

ఇచ్చోడ: విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు ఉత్తమ విద్య అందించాలని ఉట్నూర్ డీడీ వసంత్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని మేడిగూడ ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనం పరిశీలించి సిబ్బంది, విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. ప్రధానోపాధ్యాయురాలు స్వర్ణలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జోగు రామన్న

ఆదిలాబాద్‌టౌన్: నూతన సంవత్సరంలో అందరూ ఆనందంగా ఉండాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ 2025 నూతన సంవత్సరం క్యాలెండర్‌ను మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో సంఘం అధ్యక్షుడు మమ్మద్ రియాజ్‌తో కలిసి ఆవిష్కరించారు.

రామాలయం అభివృద్ధికి విరాళం



రశీదు అందజేస్తున్న కమిటీ సభ్యులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని రామాయి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న రామాలయం నిర్మాణానికి ఆదిలాబాద్ పట్టణానికి చెందిన సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి మంగళవారం తన వంతుగా రూ.31వేలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు.



నాన్ వెజ్ దుకాణాల వద్ద కస్టమర్ల తాకిడి



కేకులు కొనుగోలు చేస్తున్న ప్రజలు



బేకరీలో వినియోగదారుల తాకిడి



నాన్‌వెజ్ వంటకాలు తయారు చేస్తున్న విక్రయదారులు

న్యూ ఇయర్ జోష్

న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో మార్కెట్‌లు సందడిగా దర్శనమిచ్చాయి. కేకులు, బిర్యానీ, టపాసులు, స్వీట్లు కొనుగోలు చేసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు మార్కెట్లకు తరలిరావడంతో పట్టణమంతా రద్దీగా మారింది. బేకరీలు, రెస్టారెంట్లు, హోటళ్లు జనాలతో కిటకిటలాడాయి. వినియోగదారులను ఆకర్షించేందుకు బేకరీలు, రెస్టారెంట్ల యజమానులు ప్రత్యేక ఆఫర్లతో అమ్మకాలు చేశారు. వివిధ డిజైన్లు, రంగులతో ఉన్న కేకులను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. - ఆదిలాబాద్



తీపి వంటకం కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

డెబ్మల్ ఆలయాభివృద్ధికి కృషి

• ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



నర్సాపూర్ గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ ఆరాధ్య దైవం డెబ్మల్ ఆలయాభివృద్ధికి కృషి చేస్తామని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. మంగళవారం మండలంలోని నర్సాపూర్ జే గ్రామంలోని డెబ్మల్ ఆలయంలో పుష్యమాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ఆలయ ప్రాంగణంలో షెడ్లు, సోలార్‌లైట్లు, తాగునీటి కోసం బోర్ ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామానికి రోడ్డు, మురికి కాలువలు తదితర మౌలిక వసతులు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆత్రం కిషన్, ఆడ జంగు, కళావతి, నాయకులు చంద్రయ్య, మోబీన్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

రాయిసెంటర్ వ్యవస్థనే కీలకం..

గోండ్వాన యయితీ రాయిసెంటర్లే ఆదివాసీలకు న్యాయస్థానాలని, ప్రతీ సమస్యకు పరిష్కారం అక్కడే లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో జరిగిన గోండ్వాన పంచాయితీ రాయి సెంటర్ 38వ వార్షికోత్సవ మహోత్సవంలో పాల్గొన్నారు. జిల్లా సార్మేడీలు, గ్రామ పటేల్లు, దేవారీలు ఆదివాసీ, ఉద్యోగ సంఘ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

నేరడిగొండ: కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ సూచనల మేరకు మండలంలోని వడూర్ గ్రామస్థాయి కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మాకు నూరి రాములు, ఉపాధ్యక్షుడిగా ఇసాఖొద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పాల రమణ, ప్రధాన కార్యదర్శిగా కె.ప్రవీణ్, కార్యదర్శిగా భోజన్న, మైనారిటీ సెల్ అధ్యక్షుడిగా షేక్ ఆసిఫ్, ఉపాధ్యక్షుడిగా షేక్ జబ్బార్, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా లక్ష్మణ్, ఉపాధ్యక్షుడిగా గోనే ఊశన్న, బీసీ సెల్ అధ్యక్షుడిగా పిట్ల గంగయ్య, ఉపాధ్యక్షుడిగా ఆడెపు శంకర్, కోశాధికారిగా అబుల్క శంకర్, కార్యవర్గ సభ్యులుగా సింగం పరమేశ్వర్, కిసాన్ సెల్ అధ్యక్షుడిగా కల్లెం రామకృష్ణ, సోషల్ మీడియా కన్వీనర్లుగా రాహిల్ మలిక్, కుంట శంకర్‌లను ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఊశన్న, రవి శంకర్, షబ్బీర్, రాములు, బొలిశెట్టి రాములు, చంద్రశేఖర్, నవీన్, బొర్ర నవీన్, సంతోష్, ఇబ్రహీం, పాపన్న తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



ఎస్సైకి వినతిపత్రం అందజేస్తున్న వీడీసీ సభ్యులు

ఇచ్చోడ: మండల కేంద్రానికి రాకపోకలు సాగించే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్సై తిరుపతికి మంగళవారం వీడీసీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా శివాజీచౌక్‌లో బ్రిడ్జి పనులు కొనసాగుతుండగా చిన్న గల్లీల గుండా వాహనదారులు రాకపోకలు సాగిస్తున్నారని, వారికి ఇబ్బందులు కలగకుండా వ్యాపారులు రోడ్లపై సామగ్రి పెట్టకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. తోపుడు బండ్లు, వాహనాల పార్కింగ్‌ను కూడా నియంత్రించాలని కోరారు. అనంతరం పంచాయతీ ఈవో సూర్యప్రకాశ్‌కు సైతం వినతిపత్రం అందజేశారు. వీడీసీ అధ్యక్షుడు పెరమల్ల నారాయణ, ప్రధాన కార్యదర్శి రేణికుంట సురేశ్, గౌరవ అధ్యక్షుడు అన్నెల లక్ష్మణ్, సలహా సభ్యులు జలైజా, భీంరెడ్డి, గణేశ్, నరేశ్, ఎక్బాల్‌అహ్మద్, బాబా తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ సదస్సు విజయవంతం చేయాలి



తాంసి: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

తాంసి: ఫిబ్రవరి 3వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన లక్ష డప్పులు -వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సతీశ్ మాదిగ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో సన్నాహక సదస్సు నిర్వహించారు. గ్రామంలో డప్పులతో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సన్నాహక సదస్సులో భాగంగా రాష్ట్ర ప్రతినిధి, జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ దిశానిర్దేశం చేశారు. మండల కమిటీ సైతం ఎన్నుకున్నారు. నాయకులు అరుణ్, శ్రీనివాస్, నిఖిల్, అశోక్ తదితరులు ఉన్నారు.

తలమడుగు: ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే లక్ష డప్పులు- వేయి గొంతుల ప్రదర్శన కార్యక్రమం విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సతీశ్ మాదిగ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. అనంతరం మండల కమిటీ ఎన్నుకున్నారు. మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా ప్రేమేందర్ మాదిగ, ప్రధాన కార్యదర్శిగా శివకుమార్ మాదిగ, ఉపాధ్యక్షులుగా అరవింద్, మహేందర్, నగేశ్ మాదిగలు, కోశాధికారిగా శివకృష్ణ మాదిగ, సోషల్ మీడియా కన్వీనర్‌గా అరవింద్ మాదిగ, ప్రచార కార్యదర్శిగా గంగన్న మాదిగ, కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్, సుధీర్, గంగాధర్, గంగన్న, శివన్న, శివకుమార్, సూర్యకాంత్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కోసం నిరీక్షణ..!



నార్నూర్: మండలంలోని దేవారిగూడ గ్రామంలో గల ఐటీడీఏ ప్రాథమిక పాఠశాల గత వారం రోజులుగా ఉపాధ్యాయులు రాక తెరుచుకోవడం లేదు. పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు అనిల్ రాథోడ్ ఇన్‌సర్వీస్‌పై బీఈడీ చేసేందుకు వెళ్లినట్లు సమాచారం. సంబంధిత శాఖాధికారులు పాఠశాల తెరవడానికి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో గత వారం రోజుల నుంచి ఉదయం వేళ పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ఉపాధ్యాయులు రాక కోసం ఎదురుచూసి తిరిగి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. సీఆర్టీలు సైతం సమ్మె బాట పట్టడంతో ఏజెన్సీలోని గిరిజన గ్రామాల్లో విద్య అందని ద్రాక్షగా మారింది. ఇప్పటికైనా ఐటీడీఏ అధికారులు స్పందించి గిరిజన విద్యార్థులకు విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

మూత్రశాల మరమ్మతులకు ఆదేశాలు

సాక్షి స్పందన

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మూత్రశాలలో అల్లరి మూకలు హంగామా సృష్టించి, అందులోని సామగ్రి ధ్వంసం చేశారు. దీనిపై 'పాఠశాలలోని మూత్రశాల ధ్వంసం' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. కథనానికి జిల్లా విద్యా శాఖ అధికారులు స్పందించారు. పాఠశాలలోని మూత్రశాలకు వెంటనే మరమ్మతులు నిర్వహించాలని ఆదేశించారు. ఆదేశాలు జారీ చేశారే కానీ మరమ్మతుల కోసం నిధుల ఊసే ఎత్తలేదు. నిధులు లేకుండా మరమ్మతులు ఎలా చేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై పునఃపరిశీలన



సర్వే పరిశీలిస్తున్న ఎంపీడీవో

బేల: మండలంలోని సైద్‌పూర్, సాంగ్వి(జి), తోయగూడ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేపై మంగళవారం ఎంపీడీవో మహేందర్‌కుమార్ యాప్‌లో ఫొటోలతో పునఃపరిశీలన చేశారు. ఆయన మాట్లాడుతూ మండలం మొత్తం 12,800 దరఖాస్తులు ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చాయని, క్షేత్రస్థాయిలో 11,300 ఇళ్ల సర్వే పూర్తయ్యిందన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు

ఇంద్రవెల్లి: అర్హులైన ప్రతీ కుటుంబానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముఖడే ఉత్తం అన్నారు. మంగళవారం ఇంద్రవెల్లి మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ జహిర్, నాయకులు సోన్‌కాంబ్లే లక్ష్మి, సోన్‌కాంబ్లే జితేందర్, సుమన్‌బాయి, మారుతి, సుంకట్ రావు, పవార్ దుదిరామ్ తదితరులు ఉన్నారు.

ధర్మ సమాజ్ పార్టీ గ్రామ కమిటీ ఎన్నిక



ఎన్నికైన సభ్యులు

బోథ్: మండలంలోని కుచులాపూర్ గ్రామ ధర్మ సమాజ్ పార్టీ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా కారం నరేశ్, ఉపాధ్యక్షులుగా అడెల్లు, ప్రధాన కార్యదర్శిగా సంతోష్, ట్రెజరర్‌గా గోపిచంద్, కార్యదర్శిగా సత్యనారాయణ, సభ్యులను ఎన్నుకున్నారు.

నేడు మాలీ సంఘం సమావేశం

ఆదిలాబాద్‌రూరల్: అఖిల భారతీయ మాలీ మహా సంఘం సమావేశాన్ని బుధవారం జిల్లా కేంద్రంలోని పూలే గెస్ట్ హౌస్‌లో నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పెట్కూలే అన్నారు. మంగళవారం సంఘ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

బోథ్: మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ యార్డులో మంగళవారం పలు గ్రామాలకు చెందిన వివిధ రాజకీయపార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే ఆదివాసీలకు న్యాయం జరుగుతోందన్నారు.

మంత్రిని కలిసిన సీఆర్‌టీలు



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సీఆర్‌టీలు

ఆదిలాబాద్‌రూరల్: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఐటీడీఏ పరిధిలోని పలువురు సీఆర్‌టీలు మంగళవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను హైదరాబాద్‌లో కలిశారు. సీఆర్‌టీల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి ఈనెల 3న ఐటీడీఏ అధికారులు, సీఆర్‌టీలతో సమావేశం ఉంటుందన్నారని పేర్కొన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన చంద్రశేఖర్

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, శిశు సంక్షేమ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కను కాంగ్రెస్ పార్టీ మావల మండల అధ్యక్షుడు ధర్మపురి చంద్రశేఖర్ మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిశారు. మండలంలోని వివిధ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

మంత్రిని కలిసిన అరుణ్ కుమార్

బోథ్: ఏసీసీసీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ తుల అరుణ్ కుమార్ మంగళవారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కరీంగనర్ గ్రంథాలయం చైర్మన్ సత్తు మల్లేశ్‌తో కలిసి ఆయన మంత్రిని కలిశారు.

రైతుల అభిప్రాయాల సేకరణ



మాట్లాడుతున్న సందీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వం సాగులో లేని రైతుల పొలాలలో సోలార్ పవర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేసి, తద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించడానికి ప్రయత్నాలు చేస్తుందని ఐటీడీఏ ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్ పేర్కొన్నారు. ఐటీడీఏ పీవో ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో రైతులతో సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించిన సాధ్యాలను పరిశీలించి రైతుల నుంచి సలహాలు, సూచనలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల అభిప్రాయాలు స్వీకరించి ప్రాజెక్టు అధికారి ద్వారా ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ అధికారి శ్రీధర్ స్వామి, మండల వ్యవసాయ అధికారి రమేశ్, డీటీ సారాజీ, టీఏ కుమారి అర్షిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో నూతన సంవత్సర వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఉపాధ్యాయులు

బోథ్: మండలంలో పలు పాఠశాలల్లో నూతన సంవత్సర వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. నాగబూషణం పాఠశాలలో విద్యార్థులు 2025 ఆకారంలో కూర్చున్నారు. ఉపాధ్యాయులు కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించారు. విజ్ఞాన్ పాఠశాలలో కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయురాలు రచన, కరస్పాండెంట్ కిశోర్, విజ్ఞాన్ ప్రధానోపాధ్యాయురాలు శైలజ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ కేసులను వెనక్కి తీసుకోవాలి



ఎస్పీకి వినతిపత్రం సమర్పిస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: గుడిహత్నూర్ మండల కేంద్రంలో బాలికపై అత్యాచారం కేసులో నిందితుడిని కఠినంగా శిక్షించాలని అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు అల్లూరి భూమన్న అన్నారు. మంగళవారం జిల్లా ఎస్పీ గౌస్ ఆలంను కలిసి వినతిపత్రం సమర్పించారు. నిందితుడిపై కోపంతో కొందరు పోలీసు వాహనాలపై రాళ్ల విసరడంతో పాటు పోలీసులను గాయపర్చారని పేర్కొన్నారు. ఈ కేసులో చాలా మంది అమాయకులను అరెస్టు చేసి జైలుకు పంపారని, 21 మందిపై పోలీసుల హత్యాయత్నం, వాహన ధ్వంసం కేసులు పెట్టారని తెలిపారు. నిందితుడి కుటుంబసభ్యులతో ప్రత్యక్షంగా మాట్లాడి వాస్తవాలను తెలుసుకున్నామన్నారు. నాయకులు నవీన్, నాగేశ్, ప్రశాంత్, శశికాంత్, సత్యనారాయణ, నామ్‌దేవ్, దేవిదాస్, విఠల్, వరప్రసాద్ తదితరులు ఉన్నారు.